# మౌనం కూడా ఒక భాష



**విహారి**

మా ప్రభావతి నన్ను చాలా ఇబ్బందులకే గురి చేసింది.

అయితే, ఆమె నాకు అలాంటి ఒక ప్రత్యేకమైన అవకాశం కల్పించి వుండకపోతే-ఈ కథ చెప్పుకొనే అదృష్టం నాకు లభించి వుండేది కాదు.

ప్రభావతి ఎనిమిదిలో వుండగా నాన్నగారు పోయారు. అవును. "నాన్నగారుపోయారు, బాధ్యతలు నెత్తిమీదపడ్డాయి"- అన్న సానుభూతి వాక్యాల్లో బాగానే తడిశాను నేను. కానీ, కర్మాంతరాలకు పెట్టిన ఖర్చు తాలూకు అప్పు మాత్రం గట్టిగానే ఎండబెట్టింది.

ఆయన ఆస్తిపాస్తులేమీ మిగిల్చిపోలేదు. నన్ను జాగ్రత్తగా చూసుకోమనిచెప్పి అమ్మనీ, ఆమెనూ, నా తర్వాత నలుగురు చిన్న వాళ్ళనీ జాగ్రత్తగా చూసుకోమని చెప్పి నన్ను-విడిచి వెళ్ళిపోయాడు.

ఆ నలుగురిలోనూ పెద్దవాడు చంద్రం. రెండోది ప్రభావతి. మూడు, నాలుగు-సీత, స్వరాజ్యం.

అప్పటికి రెండేళ్ళ క్రితమే నేను ఎన్జీవో అల్పజీవిగా మారడం, కుటుంబపు సమస్యల గంపని నెత్తికెత్తుకోవడం, శారదని సహధర్మ చారిణిగా తెచ్చుకోవడం జరిగిపోయాయి.

ఆ యేడు ఎనిమిది తప్పి కూర్చుంది, ప్రభావతి.

"ఇంక దానికి చదువురాదు, ఇంట్లో పనీ పాటా నేర్చుకుంటుందిలే" అంది అమ్మ.

ప్రభావతి మాత్రం-తాను మళ్ళీ స్కూల్లోచేరి చదవాల్సిందేనని ఖరాఖండీగా చెప్పి, కాళ్ళని నేలకేసి తాటిస్తూ, చేతులు రెండింటితో లయవిన్యాసాలుచేస్తూ భరతనాట్యం మొదలెట్టింది.

స్కూళ్ళు తెరిచారు.

ప్రభావతి మళ్ళీ అదే క్లాసులో "సీనియర్ కాండిడేట్"గా, అనుభవశాలిగా ప్రవేశించింది.

మరో నెలరోజులకి అది రజస్వల అయినప్పుడు-అమ్మ మళ్ళీ తనపాట తాను పాడింది. ప్రభావతేమో తన ఆట తాను ఆడింది. ఆటగెలిచి, పాట సన్నబడింది. దాని చదువు కొనసాగింది.

పడుతూలేస్తూ పదో తరగతిలోకి దేకింది. ప్రభావతి. చదువులో ఎంతటి 'ట్యూబులైటో'-మిగిలిన విషయాల్లో అంతటి కాంతిచక్రంగా తయారైంది ప్రభావతి. బంగారంలో ముంచితీసిన శరీరచ్ఛాయ చుట్టూరా వెలుగుని చిమ్మేది. కళ్ళల్లో మెరుపు-చూసినమేరా రంగుల్ని వ్యాపింపచేసేది. గాజులగలగలలూ, కూనిరాగాలూ పసితనపు లక్షణాల్ని వెనక్కినెట్టి-వచ్చీరాని వయస్సుకుఅక్షయతూణీరంలా అమరసాగేయి.

పబ్లిక్ పరీక్షలు ఇంకో రెండు నెలలున్నై.

ఆ రోజు—

ఆఫీసు పనిమీద హైదరాబాద్‌వెళ్ళి వారం రోజుల తర్వాత ఆ రోజే తిరిగి వచ్చాను.

రాత్రి పదకొండు దాటింది.

పిల్లలంతా నిద్రలో వున్నారు.

శారద భోజన ప్రయత్నం చేయబోతుంటే, వద్దని మజ్జిగ తాగి మంచంమీద నడుం వాల్చేను.

అత్తా కోడలూ తమలోతాము తెరవెనగ్గా ఏవో గుసగుసలు పోతున్నట్టు తెలిసింది.

క్షణాల తర్వాత-

అమ్మ వచ్చి నా మంచానికి ఆనుకుని నేలమీద కూర్చుంది.

"ఏంవిటమ్మా విశేషాలు?" అడిగేను.

కొద్దిసేపు ఆమె నోరు మెదపలేదు. గోడకు ఆనుకుని కూర్చున్న శారదకేసీ, నాకేసీ చూపులు మార్చిమార్చి చూస్తూ కూర్చుంది. ఆ తర్వాత సన్నగా అంది. "ఇంత బతుకూ బతికి చివరికిట్టా అప్రతిష్టపాలౌతా మనుకోలేదు"

నేను ఉలిక్కిపడిలేచి కూర్చున్నాను. ఆమె కళ్ళ నీళ్ళు పెట్టుకుంటున్నట్టు-ఆమె మాటల్నిబట్టే అర్థమైంది నాకు.

భూకంపపు లక్షణాలు బయటపడబోతున్నట్టు నాకు తెలుస్తూనే వుంది.

"ఏం జరిగింది?"- అడిగేను.

చెంగుని నోటికి అడ్డం పెట్టుకుని, వెక్కివెక్కి ఏడవడం మొదలెట్టింది.

నేను గతుక్కుమన్నాను. నా మనస్సులో అనేక రకాలైన ఆలోచనలు సుళ్ళు తిరగసాగినై, ఆతృత, ఆందోళన ఎక్కువైనై, ప్రశ్నార్థకంగా శారదవైపు చూశాను. ప్రతిగా ఆమె మూగ చూపులే లభించినై. అసలే ఆమె-మౌనకంతాన్ని సంతరించుకున్న కొండపల్లి బొమ్మ!

క్షణాల తర్వాత తననుతానే సంబాళించుకుంది అమ్మ. చీర చెంగుతో కళ్ళొత్తుకుంటూ చెప్పసాగింది.

"దానికి చదువూవద్దు, చట్టుబండలూ వద్దంటే వినలేదు, నువ్వూ, శారదాకూడా. మీ ఇద్దరి అభిప్రాయాలకీ నేనెందుకు అడ్డు చెప్పాల్లే అని, సరే అని వూరుకున్నాను. చూశావా, అదిప్పుడెంత పని చేసిందో?"

"ఏమైంది?" మాట పెగుల్చుకుని అడిగేను.

అనుభవాల బండకొయ్యల్ని మోస్తున్న స్వరంతో అన్నది, "ఏంవైందంటే ఏం చెప్పను. పొయ్యే కాలమొచ్చింది. రంగమ్మ కొడుకుని ప్రే-మిం-చిం-ది-ట" ఆమె కంఠంలో వెటకారం, అసహ్యం, కోపం, అసహాయత, విసుగు-ఎన్ని ధ్వనించాయో!

నాకు గుండె చిక్కబట్టినట్లయింది. అంతా అచేతనంగా వున్నట్లయింది. నాకు భయంగావుంది. శారదకేసి మౌనంగా చూశాను.

సిగ్గూ, ఆవేదనా మిళితంచేసి ఆమెచూసిన చూపులో నుంచీ ఆమె అంతరంగ మధనాన్ని అవగతం చేసుకుని తలవంచుకున్నాను.

మరి కొద్దిసేపటికి అమ్మ హాల్లోకి వెళ్ళిపోయింది.

గది తలుపువేసి దగ్గరికి రమ్మని సైగచేశాను-శారదకు.

ఆమె వచ్చి మంచంమీద కూర్చుంది.

ప్రభావతిచేసిన పనికి సిగ్గు, లజ్జ, బిడియం, సంకోచం, కోపం, ఉక్రోషం, రోషం లాంటి భావాలన్నీ-ఒకేసారి శరీరంలోకి అణువణువునా వ్యాపించినట్లనిపించి నాకు.

అసలేమైందో వివరంగా చెప్పమన్న నా ప్రశ్నకు బదులుగా ఒకే ఒక వాక్యం చెప్పింది శారద.

"ప్రేమ సంగతేమోగానీ-అసలు జరగరానిదే జరిగిందని నా కనిపిస్తోంది. ఎవరినోట విన్నా ఇదే మాట"

నా చిన్నతనంలో ఒకసారి పిడుగుపడటాన్ని కళ్ళారా చూశాను. ఇప్పుడొక కొబ్బరిచెట్టు నిలు

**మర్నాడు ఉదయంనుంచీ మా యింటి వాతావరణమే మారిపోయింది. ప్రభావతిని చూసి దయ్యాన్ని చూసినట్టే జడుసుకోవడం మొదలైంది. మా అమ్మకూ, శారదకూ, మనసు లోపొరల్లో-నా పరిస్థితి ఖిన్నం....**

వునా సగానికి కాలి, చీలిపోయి-దాని క్రిందుగా పాతాళం వరకూ వ్యాపించినట్లు ఒక గొయ్యి ఏర్పడింది.

శారద మాటలు వినగానే—సరిగ్గా—ఆ దృశ్యం నా కళ్ళకు కట్టింది.

ప్రతిభావతికి సంబంధించిన కబుర్ని- శారద ఇంత సూటిగా చెప్పేసరికి తట్టుకోలేకపోయాన్నేను. "ఏఁవిటి నువ్వనేది?" అని మళ్ళీ వేసిన ప్రశ్నకు మరింత నిక్కచ్చిగానే జవాబిచ్చింది శారద. ఈ వార్త మా వీధీ వాడాలోని నలుగురి నోళ్ళలోనూ బాగా నానుతోందిట. ప్రభావతి మాత్రం నోరు మెదపటల్లేదుట. రంగమ్మ ఇంటి ఎదురింట్లో నివసిస్తున్న కాశీపతిగారి కూతురు, వరలక్ష్మి చెప్పిన మాటలు తన అభిప్రాయానికి పునాదిగానూ, ఋజువులుగానూ చెప్పుకుపోయింది శారద. ప్రభావతి రాజూ వాళ్ళింటికి సాగిస్తున్న రాకపోకలకి ఆ వరలక్ష్మే సాక్షిట. మా అమ్మ కూతుర్ని కొట్టి కోసిగిరి చేస్తే-ఆమె వాళ్ళో తల పెట్టి మేడ్చేసిందట ప్రభావతి.

క్షణంలో సగంసేపు నా బుద్ధికి వున్న దీపం కొడిగట్టిపోబోయి, అంతలోనే నిలదొక్కుకుంది.

రాజుకు సంబంధించిన వివరాలు- పుట్టుక, పెంపకం, చదువు, స్థితి గతులు-అన్నిటినీ మననం చేసుకోసాగింది నా మనస్సు.

రంగమ్మ మా ఊళ్ళోకొచ్చేనాటికి ఆమె వివరాలేవీ ఎవరికీ తెలీవు ఆ మాటకొస్తే, మా ఊరుకూడా అప్పట్లో ఊరు క్రిందే లెక్కకాదు. రైల్వే స్టేషన్‌కు మూడు ఫర్లాంగుల దూరంలో విసిరేసునట్టున్న- పల్లె పట్నమూ కాని ఊరు అది. స్టేషన్‌కు పాతిక గజాల దూరంలో మా ఊరి బాట ప్రక్కన-బేగోడీలూ, పకోడీలూచేసి అమ్ముకునే మగదిక్షత లేని ఆడదిగా-ఆమె తొలిసారిగా మా ప్రాంతాన రంగప్రవేశం చేసినట్లు చెప్పుకోవడం నాకు తెలుసు. ఆ తర్వాత, ఆమే చూపులు లింగయ్యమీద పడ్డాయని కొందరూ, కాదు, లింగయ్య మనస్సే రంగమ్మ శరీర సౌష్టవంమీద వాలి ఆమెకు మగదిక్షత లేని లోటుని తీర్చాయని కొందరూ చెప్పుకున్నారు.

ఊరినుంచీ స్టేషన్‌దాకా ఒక లారీరోడ్డూ, ఊళ్ళో వీధిదీపాలూ, వాడకట్టున కొన్ని పెద్ద పెద్ద అంగళ్ళూ వెలికొనే నాటికి-రంగమ్మని వో 'ఇంటిదాన్ని' చేశాడు లింగయ్య.

మరో రెండేళ్ళలో-మా ఊరికి పక్కగా తుంగభద్రకి చిన్న డామ్ పడేసరికి, ఆ ప్రాంతం రూపురేఖలు మారడం ఎంత సహజంగా జరిగిపోయిందో, రంగమ్మ రూపు రేఖలు మారడమూ అంత సహజంగానే జరిగిపోయింది. ఆమెకి పెద్ద పెద్ద వాళ్ళతో పరిచయాలూ ముదిరినై. తరచూ జిల్లా కేంద్రానికి, రాష్ట్ర రాజధానికి రాకపోకలూ సాగినై.

మా ఊరు టౌన్‌గా మారిపోయిన దానికి దాఖలాగా-ఊళ్ళో నాలుగు సినిమా హాళ్ళూ, లాడ్జింగ్‌లూ, వోవర్ బ్రిడ్జీ, దాన్నికింది 'అలగా జనం' పైన సాయంకాలాల్లో 'పిల్ల' గాలుల సేవ్వడీ, ఖాళీ స్థలాల్లో రికార్డ్ డాన్సులజోరు, వాక ఫెమ్యూజ్‌మెంట్ పార్కూ, రాజకీయాల హోరూ వెలిసి, షాపులలోపల డెకోలామ్ ఫినిషింగ్‌లూ, బయట సీరియల్ లైట్లూ వెలగనారంభించినై.

రంగమ్మ ఇల్లు జంట మిద్దెల రెండంతస్తుల మేడగా మారింది. దానికి రిక్షావాల్లేమో రంగసాని బిల్డింగనే పేరుని జనం నోళ్ళల్లో ఖరారు చేసేశారు.


ఈ అభివృద్ధి కార్యక్రమాల మధ్య అప్పుడెప్పుడో రంగమకి రాజు పుట్టేడు.

రాజు చిత్రం చక్కటి రూపు రేఖలు సంతరించుకోవడానికి— రంగమ్మ వివిధ రంగుల్నీ, కుంచెల్నీ నైపుణ్యంతోనే వాడుకుంటూ వచ్చింది.

రాజు బొమ్మ అందంగానే తయారైంది. అతన్ని అందరూ గౌరవంగానే చూడసాగేరు.

అయితే, ముడిసరుకు గురించి జనమందరికీ తెలియడంవలన- దానితో తయారు కాబడిన శిల్పం పట్లకూడా-ఎవరి మనస్సుల్లో వారికి రాజు ప్రవర్తన, స్వభావానికి సంబంధించిన అంచనాలూ, అభిప్రాయాలూ- ఒక పరిధిలోనే తిరుగుతూ వుండేవి. వాటికి కేంద్ర బిందువు-'రంగసాని' గత చరిత్ర. అతన్ని, అందువలన 'సాని కొడుకు'గానే-ముద్రవేసేశారు జనం.

కాగా, అమ్మ చెప్తూ వున్నట్టు మా వంశ గౌరవాన్ని గురించి ఒక్కమాటలో చెప్పాలంటే- 'మాది ఋషీసంప్రదాయం', 'నిప్పులు కడుక్కునే ఆచారం'ట!



గుండె ఉగ్గబట్టుకుని, కళ్ళు నులుముకుని రాజు రూపాన్ని నా కళ్ళ ముందుకు తెచ్చుకున్నాను. ఎంతగా ఆలోచించినా అతను 'ఒక ప్రాడిగల్ సన్' కంటే భిన్నంగా, అధికంగా అనిపించలేదు. బికాం చదువుతూ అతను పోతున్న పోకళ్ళని దృష్టిలో వుంచుకుని ఆలోచిస్తే మా పరిస్థితి బోనులో చిక్కిన ఎలుక మాదిరిగానే వున్నట్టు అర్థమైంది.

నా ఆలోచనలు ఒక కొలిక్కి రాగానే. పక్కకి చూసేసరికి శారద మగత నిద్రలోకి జారుకుని వుంది.

ప్రభావతీ రాజూ గురించిన ఆలోచనల్తో- ఆ రాత్రి కింక నాకు నిద్రపోయింది. కానీ నా ఆలోచన్లో మాత్రం వాళ్ళిద్దరూ నిద్రపోలేకపోయారు.

మర్నాడు-ఉదయంనుంచీ-మా యింటి వాతావరణమే మారిపోయింది. ప్రభావతిని చూసి దయ్యాన్ని చూసినట్టేజడుసుకోవడం మొదలైంది. మాఅమ్మకూ, శారదకూ. మనసు లోపొరల్లో- నా పరిస్థితి ఇందుకు భిన్నంగా లేకపోయినా వాస్తవమూ. బాధ్యతా- బహుశా-నేను మాత్రం నా ప్రవర్తనలో ఎలాంటి భేదాన్నీ చూపడానికి వొప్పుకున్నట్టు లేవు.

పెనం కాలిపోతున్నదని పొయ్యిలోపడి లాభమేముంది అనే వివేచన నన్ను నిలదొక్కుకునేటట్టు చేసింది.

నేనూ, మా అమ్మా, శారదా-ఎన్ని తర్జన భర్జనలు చేస్తున్నా-ప్రభావతిమాత్రం ఈ మొత్తం వ్యవహారం పట్ల కిమ్మినాస్తిగా ఊరుకుంది. మేమంతా ఎంతగా తలబాదుకుని, ఎన్ని ప్రశ్నలు వేసినా ఆమెనుంచీ ఏ సమాధానమూ రాబట్టలేకపోయాము. నా అంతరాంతరాల్లో మాత్రం- ప్రభావతి ఒక్కసారి 'నాకేం తెలీదు లెండి' అనే సమాధానం చెప్తే బాగుండుననే కోరిక, ఆశ, ఆకాంక్ష చాలా బలీయంగానే వుంది. అయితే. నా కోరిక తీరలేదు. ఊహని వాస్తవం తారుమారు చేయడం సహజమే గదా !

రెండురోజుల తర్వాత- మాఅమ్మ రంగమ్మతో మాట్లాడి రావడానికిపోయి 'కళ్ళనీళ్ళ పెట్టుకుని' వచ్చింది.

ఈ ఆంతరంగిక విషయానికి వీలయినంత గోప్యంగా వరలక్ష్మి సహాయంతో తన మనస్సుకు తాను దోహదక్రియలు సలుపుకుంటూ వుంది శారద.

అమ్మ రంగమ్మ గారింటికి వెళ్ళివచ్చినప్పట్నుంచీ-ప్రభావతి కథ మా ప్రమేయం లేకుండా మలుపు తిరగసాగింది. మాతో మాట్లాడేవాళ్ళంతా 'సానికొడుకుతో సావాసాలేంవిటి, వాడు దీన్ని ఎక్కడో తాకట్టేస్తాడు' అని వెటకారమో, సానుభూతో తెలీని సలహాని విసరసాగేరు. రంగమ్మతో మాట్లాడే వాళ్ళంతా- 'మా మిద్దెముందు పరిచిన ఒక్క చలువరాయి ఖరీదు చెయ్యరు వాళ్ళంతా కలిసి. మా అబ్బాయిమీద చూపులేసి పడగొట్టాలనుకోవడం- అమ్మమ్మా... ఎంత తెగింపు, ఎంత దురాశ' అని గాలికొట్టసాగేరు.

ఈ వ్యవహారం రగడగా మారకూడదని మేము ఎంతగా నోళ్ళు కట్టేసుకున్నా, ఊరు ఊరుకోలేదు.

నా మనస్సు ఎడారి అయిపోయింది. అందులో మబ్బు ముక్క మిగల్లేదు. నా పరిస్థితి విచిత్రంగా తయారైంది. వీధిలో నడుస్తుంటే నలుగురూ నన్ను 'చెల్లెల్ని అదుపులో పెట్టలేనివెధవాయి'లా చూస్తున్నారనే భావమూ, పెదవులుబిగించి వంకర నవ్వులు నవ్వుకుంటూ, నొసలు చిట్లించి వెక్కిరిస్తున్నారనే బాధా- కలగడం మొదలైనై. ఆఫీసులో కూడా- సహోద్యోగుల చూపుల్లో ఇలాంటి భావాలూ, ప్రశ్నలూ ఎకసెక్కెలూ చదువుకుటున్నప్పుడు గుండెల్లో వో మూల సన్నని బెజ్జం పడసాగింది.



డ్రాప్స్

అది ఇంగ్లీషు క్లాసు.

"డ్రాప్స్ అంటే చుక్కలు. డ్రాప్స్ అనే పదం ఉపయోగించి ఓ వాక్యం చెప్పు కృష్ణా" అన్నారు మాస్టారు.

"డ్రాప్సార్ షైనింగ్ ఇన్ ది స్కై" ఠక్కున చెప్పాడు కృష్ణా.

—జి.వి.ఎమ్. ఫణిప్రసాద్ (గోదావరిఖని)

ప్రభావతి పరీక్షలు రాసింది.

ఈలోగా మా పేటలోని వాళ్ళంతా దాని పేరుకి ముందూ వెనకా అనేక రకాలైన రంగు తాళ్ళముళ్ళు పెట్టేశారు. చెడిపోయిన పిల్ల అని కొందరు చెవులు కొరుక్కుంటే: కాలు జారిందని మరికొందరు కళ్ళతోనే తమ మనసులకు కలకండ ముక్కల్ని అందించుకున్నారు.

అమ్మ ఏడుపు, శారద చిరచిర-తారస్థాయికి పోయి 'హత్యలు, ఆత్మహత్యలు' మాటల్లో దొర్లసాగినై.

ఆ వేళ—

రాత్రి తొమ్మిదిగంటలు దాటింది. వెంకటేశ్వర టాకీసు ముందు పచార్లు చేయసాగేను నేను. ఆ సమయానికి రాజు ఆ పక్కసందులో వున్న కాశేశ్వరరావు మాష్టారింటినుంచి వస్తాడని నాకు తెలుసు అతనికి అక్కడ ట్యూషన్ వుంది. ఈ ప్రహసనాన్ని గురించి స్వయంగా అతనితో మాట్లాడలన్నదే నా ఉద్దేశ్యం.

సన్నగా జల్లు మొదలైంది. నేను టీ కొట్టు షసారాలోకి వెళ్ళి నిలబడ్డాను.

రాజు వచ్చాడు. అతన్ని ఆపేను. మాటలు మొదలెట్టాలంటే గుండెల్లో ఏదో జడుపూ. పిరికితనమూ ప్రవేశించినై. రాబోయే ప్రతిక్షణమూ భయంకరంగా 'మారపోతున్నదనే భావన — నా శరీరంలో నిస్సత్తువని ప్రవహింపజేయసాగింది.

రాజు నా వైపు చూశాడు. 'చెప్పండి' అన్నాడు చాలా సామాన్యంగా, సౌమ్యంగా.

'ఎలా చెప్పాలి? ఏం చెప్పాలి? ఏం అడగాలి? ఎలా?'-గొంతులో పచ్చి వెలక్కాయ పడటమంటే ఏంవిటో తెలుస్తోంది నాకు.

క్షణాలు నిముషాలైనై.

"ఇప్పుడీ ప్రశ్నలూ, సంజాయిషీలూ ఎందుగ్గానీ, రామంగారూ-వెంటనే ట్రాన్స్ఫర్ చేయించుకుని మీరీ వూరునుంచీ వెళ్ళిపోండి సార్. మీ

మెతుకుల..... యంఐ కిషన్



చెల్లికి పరీక్షలుకూడా అయిపోయినై కదా" అన్నాడు రాజు. పుస్తకాల్ని వేరే చేతిలోకి మార్చుకుంటూ నెమ్మదిగా తలవంచుకుని, నిమ్మళంగా అక్కణ్ణుంచీ కదిలి వెళ్ళిపోయాడు

"ప్రభావతి జీవితంమీద ఇంత మసిని పులిమేశిన తర్వాత అంతకంటే ఇంకేం చెప్తాడు- "రోగ్" అనుకుంది నా మనస్సు.

ఇంటికివచ్చి అమ్మతో, శారదతో జరిగింది చెప్పాను. ప్రభావతి కూడా విన్నది. చంద్రం కూడా విన్నాడు. వాడు అదే మంచిదన్నాడు.

ఈ సలహా గురించిన ఆలోచనలు నా మేధస్సులో వాన పాములైనాయి.

ఒక రాత్రివేళ—

కలతనిద్ర చెడరిపోయి లేచి కూర్చున్నాను.

బలహీనమైన గొంతుతో ఏడుపు వినిపిస్తోంది. హాల్లోకివచ్చి చూశాను. అమ్మ, పిల్లలు నిద్రపోతున్నారు. నా గడికి అవతలవైపు వున్న పెరట్లోకి నడిచేను.

ప్రభావతి! నూతిగట్టున పారిజాతం చెట్టు పక్కగా కూర్చుని వుంది. మోకాళ్ళమీద తల ఆన్చి సన్నగా ఏడుస్తోంది.

నన్ను చూసి త్రొటుపడిలేచి నిలబడింది. పమిట చెంగుతో కళ్ళొత్తుకుంది. పక్కగా లోపలికి వెళ్ళిపోబోయింది.

"ప్రభా!"—పిలిచేను. ఆగింది.

"నీ ఉద్దేశ్యం ఏవిటి? అసలేం జరిగిందో చెప్పు" అంటూ అనునయంగా అడిగేను.

"మనం ఈ ఊరునుంచీ వెళ్ళిపోదాం" అంటూ మరేమీ అడగటానికి నాకు అవకాశ మివ్వకుండా లోపలికి వెళ్ళిపోయింది.

సూర్యోదయం కాలేదని తెలుస్తూనే వున్న నాకు, మసక వెలుతురు మాత్రమే కనపడుతోంది.

అంతే—

అడుసు త్రొక్కిన తర్వాత కాలు కడుక్కోక తప్పదు గదా మరి!

హైదరాబాద్ వచ్చి చేరేము.

ప్రభావతి పదో తరగతి పాసయ్యింది. కాలేజీలో చేరమని మాట వరసకి అన్నాం. 'అఖ్ఖర్లేదు' అంది. చంద్రం బికాంలోనూ, సీత, స్వరాజ్యం—పది, ఎనిమిదిలోనూ చేరేరు.

అంతా యాంత్రిక జీవనం. దానికి నిదానం-విధానం, తీరుతెన్నూ, దరిదారీ, ఇదమిత్థమైన సరళీసారళ్యం లేనేలేవు.

నీడల్ని క్రీనీడల్ని పరుస్తూనూ, జీవనమరణ సమస్యల్ని సృష్టిస్తూనూ- మరో రెండేళ్ళు ముందుకు పోయింది కాలం.

ఆవేళ—

సెలవురోజు—

ఉదయం పదిగంటలౌతోంది.

గచ్చకాయ రంగు ఫియట్-కారు వచ్చి మా యింటి ముందు ఆగింది. దాన్లోంచి దిగి సరాసరి లోపలికి వచ్చేశాడు రాజు.

ఆశ్చర్యంతో, సంభ్రమంతో- బొమ్మలా నిలబడిపోయాన్నేను. చంద్రం కుర్చీ తెచ్చి వేశాడు. రాజు కూర్చున్నాడు.

"ఉపోద్ఘాతాలూ, వివరణలూ ఎందుకుగానీ నాకూ ప్రభావతికీ పెళ్ళి ముహూర్తం చూడండి మాష్టారూ' అని మరుక్షణంలో తగ్గు స్థాయిలో అన్నాడు. 'మా అమ్మ నిరుడుపోయింది. నేను మా ఊళ్ళో ఆస్తినంతా అమ్మేసుకొచ్చి ఇక్కడే స్థిరపడ్డాను. స్టెయిన్‌లెస్ స్టీల్ ఫ్యాక్టరీ ప్రారంభించాను. ఇదిగో ఇంటి అడ్రస్"- విజిటింగ్ కార్డ్ ఇచ్చేడు.

అమ్మ, శారదా వచ్చి తలుపు వారగా నిలబడ్డారు.

క్షణాల తర్వాత అన్నాడు రాజు, 'రంగసాని కొడుకుగా మీ అమ్మాయిని అడిగే అర్హత నాకు లేకపోవచ్చు గానీ, మంచి ముత్యాల్ని, రత్నాల్నీ ఎక్కడున్నా వెతుక్కోగల హక్కున్న మనిషిగా మీరు నన్ను అంగీకరిస్తారనుకుంటాను"



రారు

నాని, చిట్టి స్కూలు కెళుతున్నారు.

"మా ఇంటికి చుట్టాలెవరూ రారు తెలుసా?" అంది చిట్టి.

"ఎందుకని?" అడిగాడు నాని

"చుట్టాలొచ్చినప్పుడల్లా మా అమ్మా నాన్నా పోట్లాడుకుంటారు" చెప్పింది చిట్టి.

—ఎన్. రుద్రాణి (గుంటూరు)

"మరి ఆ రోజున-నేను మిమ్మల్ని..." నా పెదిమలు నసిగినై.

"పరిస్థితులూ, పరి[illegible]రాలూ అలాంటివి, చక్రాల్లో అసలు గాలిలేని సైకిల్‌ని తీసుకుని ఎదురు గాలిలో ఎందుకు ప్రయాణం చెయ్యాలి అనిపించింది. అప్పటికదే వివేకమనిపించింది. అంతే"

తీవిగా లేచి నిలబడ్డాడు రాజు. అతను 'వస్తాను మరి' అని కదలబోతుండగా బయటికి వచ్చింది ప్రభావతి.

వారిద్దరి చూపులూ కలిసినై.

* * *

తొలిరేయి—

ప్రభావతిని తన కౌగిట్లో బంధించి, 'అంతటి నిందపడి నానాగోడూ జరిగిపోతుంటే-రాజూ నేనూ కనీసం ఒక్కసారన్నా మాట్లాడుకోలేదనే నిజాన్ని; నేను వాళ్ళింటికి వెళ్ళివస్తున్నది కేవలం పొగడపూలు ఏరుకునేందుకనే నిజాన్ని-మీ వాళ్ళకి ఎందుకు చెప్పలేదు?" అని ప్రశ్నించాడు రాజు.

"అప్పటికే నిప్పులేని ఆ పొగని మావరలక్ష్మి చాలా ముందుకి తీసుకుపోయింది. ఆ స్థితిలో నేను వెనక్కు వెళ్ళి ఏ ఘోషపెట్టినా సాధించేదేం వుంది. అందుకని మాట్లాడకుండా వూరుకున్నాను. పైగా, నలుగురు నా భవిష్యత్తు నీతో ముడి బెట్టేశారు. 'అన్ని కలలూ కల్లలే అవుతాయని ఎందుకు నిర్ణయించుకోవాలి' అని గుండె దీటవు చేసుకున్నాను. కనుకనే విజయం నాదయిందు మరి' అంది ప్రభావతి సిగ్గుల మొగ్గవుతూ. గర్వంగానూ నవ్వింది. ఆ నవ్వులో పొగడలు విరిసినై, ముత్యాలూ రత్నాలూ కురిసినై!

* * *

రాజు నాకీ వాస్తవం చెప్పినప్పుడు- 'కల్లోలమైన సరస్సులో కూడా— కలువపూవు-తన ఉనికి మీద గంపెడాశతోనే నిరీక్షిస్తూ వుంటుందని' నా కనిపించింది.

కన్నె పిల్ల కథ కూడా ఇంతేనన్నమాట!

ఆమె మనస్సుకు అక్షరమాల తెలుసు!!

ఆ అక్షరమాల విరిసే హరివిల్లూ తెలుసు!!! ✱

